# సమీరంలో సమిధలు



**అమెరికా** సైనికులు వియత్నాంపై యుద్ధం చేస్తూ అనేకమంది 'వార్ బేబీ'లను పుట్టించారనీ, వాటిని అమెరికా స్వీకరించడానికి ఒప్పందం కుదిరిందనీ... యిలాటివి పేపర్లో చదవడమే కానీ ఆ సంకరసంతానం ఎలా ఉంటారో, వాళ్ల బాధలేమిటో మీ కనుభవంలోకి వచ్చి ఉండవు. నాకూ అంతే బాబా కలిసేదాకా.

బాబాను కలవడం కలకత్తా కాన్ఫరెన్సు కెళ్లినప్పుడు జరిగింది. మా బావమరిది నన్ను పరిచయం చేయగానే 'మీరు ఢిల్లీలో సెంట్రల్ సెక్రటేరియట్‌లో పనిచేస్తారు కదా' అంటూ నా చరిత్ర అప్పజెప్పాడతను. నేను తెల్లబోతే మా వాడు నవ్వుతూ "బాబా అంటే ఏమిటనుకున్నావు బావా! అతనికి తెలియని విషయం లేదు. బంగ్లాదేశ్ నుండి రెండేళ్ల క్రితం పొట్టచేత్తో బట్టుకుని వచ్చాడు. ఇక్కడ కొచ్చి బాగుపడ్డాడు. మాట చాకచక్యంతో ఎవర్నైనా బుట్టలోవేయగలడు. కాళ్లు పట్టుకునైనా, కత్తి చూపించైనా కార్యం సాధించగలడు. ఇంట్లో మనిషిలాటి వాడనుకో. రేపు నీకు ఊరు చూపించడానికి బెత్తాయించాను." అన్నాడు.

బాబా పాతికేళ్ల కుర్రాడు. నాజూగ్గా, అందంగా ఉన్నాడు. మర్నాడు ఊరు చూపించేటప్పుడు తెలిసింది – చదువు పెద్దగా లేకపోయినా హిందీ, ఇంగ్లీషు కూడా చక్కగా మాట్లాడగలడు. మనిషిలో

ఎమ్బీయస్ ప్రసాద్

ఆకర్షణ ఉంది. మాట్లాడ బుద్ధేసింది - "మీ అమ్మా, నాన్నా పోయేరటగా" అన్నాను.

అతను ఓ సారి దీర్ఘంగా చూసేడు. పొద్దుటినుండి ఊరంతా తెగ తిరిగి ధాకూరియా లేక్ గట్టు మీద కూర్చుని ఉన్నాం.

"నా కథ పూర్తిగా ఎవరికీ తెలీదు సార్. మీ వాళ్లకి కూడా. నేనెవరికీ చెప్పలేదు. కానీ మిమ్మల్ని చూస్తూంటే ఆత్మీయత కలిగి చెప్పబుద్ధేస్తోంది. మా అమ్మ పోయిన మాట నిజమే! నాన్న సంగతి మాత్రం తెలీదు.

"సాబ్ చెప్పే ఉంటారు. మాది బంగ్లాదేశ్ అని. 1970 నాటికి అది తూర్పుపాకిస్తాన్ గానే ఉండేది కదా. బంగబంధు షేక్ ముజిబుర్ రహమాన్ ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయం సాధించడం, ఆయనను ప్రధాని చేసే బదులు జైలుపాలు చేసి, తూర్పు పాకిస్తాన్‌పై పశ్చిమ పాకిస్తాన్ దండెత్తడం మీకు గుర్తుండే ఉంటాయి. మతం పేరుతో మా ఇద్దర్నీ ఒక గాటకు కట్టినా పశ్చిమ పాకిస్తాన్ వాళ్లకు మేమన్నా, మా సంస్కృతి అన్నా ఎప్పుడూ మంటే. దానికితోడు రాజకీయ కారణాలు తోడయ్యేయి. మా దేశాన్నీ, సంస్కృతినీ కాలరాయడానికి పెద్ద యెత్తున జెనోసైడ్ జరిపేరు.

"పశ్చిమ పాకిస్తాన్ సైన్యం చేసిన అత్యాచారాలు, మానభంగాలు ఇన్నని చెప్పనలవి కాదు. మా అమ్మ మామూలు సివిలియన్ - మా ఇంట్లో చొరబడి ఒకడామెను చెరిచాడు. తను ఎదిరించింది. చివరికి పశుబలానికి లొంగిపోయింది. ఫలితంగా నేను పుట్టాను.

"కన్నెగానే తల్లయిన మా అమ్మను మా తాత, అమ్మమ్మ, మేనమామలు - అందరూ వెలివేసినట్టు చూసారు. వాళ్ల కళ్లెదుటే అఘాయిత్యం జరిపిన శత్రువుపై కలిగిన కోపాన్ని ఆ శత్రువు ప్రతిరూపాన్నైన నాపై చూపించారు. నాబోటి వాళ్లు పదిమంది దాకా ఊళ్లో ఉన్నాం. మమ్మల్ని తమతో కలుపుకోడానికి ఆ ఊరి వాళ్లకు సంకోచంగానే ఉండేది. నిరాదరణ వల్ల చదువు సరిగా అబ్బలేదు మాకు. ఎలాగోలా పొట్ట పోసుకునేవాళ్లం. మా అమ్మ చచ్చిపోగానే ఆ ఊరితో బంధం తెంపుకుని కలకత్తా వచ్చి పడ్డాను"

"అయితే మీ నాన్నెవరో నీకు తెలియదంటావు" అన్నాను కుతూహలంగా.

"ఒక విధంగా తెలుసు. మా అమ్మ అతని యూనిఫాం చింపేసినపుడు అతని ఐడెంటిటీ కార్డు క్రింద పడిపోయింది. అమ్మ దాన్ని భద్రంగా దాచి నాకిచ్చింది. నా జీవితంలో ఏకైక ఆశయం మా నాన్నను వెతికి పట్టుకుని ఆయనచేత కొడుకు ననిపించుకోవాలనే."

"అది అంత సులభమా? ఎప్పుడో పాతికేళ్ల క్రితం నాటి మాట. ఇప్పుడే పొజిషన్లో ఉన్నాడో!" యుద్ధంలో చచ్చిపోయి ఉండవచ్చు అని తోచినా అనలేదు.

"అప్పుడాయన మేజర్. మేజర్ ఎచ్.ఎఫ్.కె. అసదుల్లాఖాన్... ఏం అలా ఉలిక్కిపడ్డారు? ...మీకాయన తెలుసా?"

"నేను తొట్రుపడ్డాను. అబ్బే, అది కాదు... ఆ పేరు గలాయన ఒకతను తెలుసు... పాకిస్తాన్ హై కమీషనర్ ఆఫీసులో పనిచేస్తూంటాడు. ఆర్మీ నుండి రిటైరయ్యేడు. నిజానికి నాకు వాళ్లావిడే బాగా తెలుసు. ఆవిడ పూర్వీకులది మా హైదరాబాదు. పాకిస్తాన్‌కి తరలిపోయేరన్నమాట. ఆవిడకి హైదరాబాదు కల్చరన్నా, వంటలన్నా మహా ఇష్టం. మా ఢిల్లీ ఆంధ్ర సమాజం నిర్వహించే ఉర్దూ ప్రోగ్రాములన్నిటికీ కూతుర్ని తీసుకుని హాజరవుతూంటుంది. నేను సమాజం ట్రెజరర్ని కదా. తరచు ఫోన్ చేసి ప్రోగ్రాం వివరాలడుగుతూంటుంది. కూతురి వయస్సు ఇరవై లోపే ఉంటాయి. ఆయన మీ తండ్రి అయివుండచ్చేమోననిపిస్తోంది."

బాబా ఎంత ఎక్సైట్ అయ్యేడో మాటల్లో చెప్పలేను. నన్ను బలవంతాన టాలీగంజ్‌లోని వాళ్లింటికి తీసుకెళ్లి వాళ్ల నాన్న ఫోటో చూపించేడు. పాత ఐడెంటిటీ కార్డు కదా, అతనే ఇతననిపించింది. అంతే! నేను రైలెక్కేవరకూ బాబా నన్ను అంటకాగి ఉన్నాడు - తన గురించి ఖాన్‌కి ఎలా నచ్చచెప్పవచ్చో పరిపరి విధాల నాకు సూచిస్తూ.

ఖాన్ మండిపడ్డాడు. బంగ్లాదేశ్ దాడి సమయంలో తన యూనిఫాం ఓ పిల్ల చింపేసినట్టు గుర్తున్నా, దాని మొహం గుర్తు లేదన్నాడు. దాన్నే కాక సవాలక్ష మందిని తను రేప్ చేసానన్నాడు. ఆ పిల్లను కూడా తను కాక సవాలక్ష మంది ఇతరులు రేప్ చేసి ఉంటారన్నాడు. ఇలాటి కొడుకులు తయారయితే పిలిచి వాటేసుకోడానికి తనకు మతిలేదాని అడిగేడు. షబ్నమ్ ఒక్కతే తన బిడ్డ అన్నాడు. మళ్లీ ఈ విషయం ఎత్తితే మాట దక్కదన్నాడు.

చివరి ప్రయత్నంగా బాబా వంటి వార్ బేబీల గతి ఏమిటని అడిగేను. 'లెట్ దెమ్ గో టు హెల్' అన్నాడతను. ఆ విషయమే మా వాడికి రాసి పడేసాను – బాబాకు చెప్పి ఓదార్చమని. దాని తర్వాత బాబా నా జోలికి వస్తాడనుకోలేదు.

కానీ నెల తిరక్కుండా తండ్రిని చూడాలంటూ బాబా వచ్చేసాడు. ఢిల్లీలో ఉంటూ ఆయన్ను అప్పుడప్పుడు చూసుకుంటూ ఉంటాడట. "కలకత్తాలో పడిన కష్టమే ఇక్కడా పడతాను. కడుపు నిండకపోదు." అన్నాడు.

"బాగానే ఉంది కానీ ఖాన్ దగ్గరికి తీసుకెళ్లను. వాళ్లావిడ షహనాజ్ మంచిది. ఈసారి ప్రోగ్రాంకు వచ్చినప్పుడు నిన్ను హైదరాబాదు వాడివని పరిచయం చేస్తాను. ఆపై సంగతి నువ్వు చూసుకో. కానీ హైద్రాబాదు యాస...?"

"అదెంత పని సాబ్! చిటికెలో నేర్చుకుంటాను." అన్నాడతను హుషారుగా.

అప్పట్టుగానే షహనాజ్‌కు పరిచయం చేసినప్పుడు అసలు, సిసలు హైదరాబాదీ లాగానే మాట్లాడేడు. ఆవిడా, కూతురూ అతని కబుర్లు విని చాలా సంతోషించినట్టు కనిపించారు. మనకు గొడవ వదిలింది కాని నేనూ సంతోషించాను.

ఆ తర్వాత జరిగిన ఆంధ్ర సమాజం ఎన్నికల్లో నేను ఓడిపోవడం, అలిగి అటువైపు వెళ్లకపోవడంతో షహనాజ్‌ను మళ్లీ చూడడం పడలేదు. ఓ సారి ఆవిడ ఫోన్ చేసి బాబా గురించి చాలా ఆదుర్దాగా అడిగింది. నాకు అతని వివరాలేమీ తెలియవని చెప్పి తప్పించుకున్నాను.

ఆ రోజు బాబా వచ్చినప్పుడు గుర్తుపట్టలేకపోయాను. చూసి ఏడాదయిందనే కాదు, పెద్దింటి కుర్రాడిలా, దొరబాబులా తయారయ్యేడు. వస్తూనే "మీరు నా కో ఉపకారం చెయ్యాలి. ఖాన్ గారి ఇంటికొచ్చి నేను ఆయన కొడుకునని చెప్పాలి" అన్నాడు. ఆ రాక్షసుడింటికి రానన్నాను.

"మీకు తెలిసిన పొగరుబోతు ఖాన్ కాదిప్పుడు. అతని కూతురు పెళ్లి కాకుండా తల్లయింది. కడుపు చేసినవాడు ఆమె కంటబడకుండా పారిపోయి చాలా కాలమైంది. ఈయనంటే భయంతో తల్లి దాచిపెట్టి చివరికి బయటపెట్టేసరికి గర్భంలో శిశువు పెరిగిపోయింది. ఎవరికీ తెలియకుండా నర్సింగ్‌హోంలో చేర్పించి పురుడు పోయిస్తున్నారు. ఇవాళే పురుడు వస్తుందంటున్నారు డాక్టర్లు. ఖాన్ గారికి ఆయన అల్లుడి వివరాలు తెలియవు. అవి నేను చెప్తాను" అన్నాడు.

సరేనని వెళ్లాను. ఆయన మహా చికాగ్గా ఉన్నాడు. నేను బెదురుతూనే "మీతో ఇంతకుముందు ప్రస్తావించాను కదా. బంగ్లాదేశ్ వార్ బేబీ అని. ఇతనే... బాబా" అని అంటూ పరిచయం చేసాను.

ఖాన్ చేయి కలపలేదు. కనుబొమ్మలెత్తి అతని కేసి దీర్ఘంగా చూసాడు. తన పోలికలు ప్రస్ఫుటంగా కనబడ్డాయేమో, "బెంగాలీ కుర్రాడిలా లేవే!" అని అన్నాడు మెల్లగా.

"ఎలా ఉంటాను సార్, మీ రక్తం నాలో ప్రవహిస్తూంటే..." అన్నాడు బాబా చిరునవ్వుతో. "వాట్ నాన్సెన్స్.." అని అంటూన్న ఖాన్ నాపి "రావు గారు అంతా చెప్పారుగా. నన్ను చూడనప్పుడు ఆయన చెప్పినది మీరు నమ్మి ఉండకపోవచ్చు. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నారుగా. సందేహం తీరిపోయి ఉంటుంది. నన్ను కొడుకుగా అంగీకరించడానికి..."

"ఇదెక్కడి న్యూసెన్స్? నా సమస్యలతో నేను సతమతమవుతున్నాను. ఇవాళ మరీను... మిస్టర్ రావ్, ఇలాటి వాళ్లను..."

"మీ సమస్య నా సమస్య కంటే పెద్దది కాదు సర్. నా తండ్రియై ఉండి మీరిలా.."

"నాన్సెన్స్, తండ్రి ఏమిటి తండ్రి? ఏదో ఆ క్షణంలో అలా జరిగిందంతే. ఆ మాట కొస్తే మేం ఆక్రమించిన ప్రతి ఊళ్లోనూ అలాగే జరిగింది. అయితే వాళ్లందరూ పిల్లల్ని కని నామీదకు తోలలేదే.."

"...వాళ్లందరికీ ప్రతినిధిగానే నేను వచ్చాను."

"ఇడియట్లా మాట్లాడకు. నేను నిన్ను కొడుకుగా స్వీకరించాలా? సమాజం ఎదుటకు తీసుకెళ్లి ఎలా పరిచయం చెయ్యాలి? 'వీళ్ల అమ్మ ఎవరో నాకు ఊరూ, పేరూ తెలియదు. మొహం గుర్తులేదు. పాడు చేశానో లేదో గుర్తుపట్టలేను. కానీ వీడు మాత్రం నా కొడుకుట..' అని చెప్పాలా? నవ్విపోరూ?"

బాబా కొద్దిసేపు ఊరుకున్నాడు. "నన్ను కొడుకుగా స్వీకరించమని అడగను. కానీ నా జీవితాన్ని సర్వనాశనం చేసే హక్కు నీకెవరిచ్చారో చెప్పు. ముఖపరిచయమైనా లేని నా తల్లి శరీరాన్ని స్వంతం చేసుకునే అధికారం నీకెలా వచ్చిందో చెప్పు. మా జాతిలో మీ జాతి రక్తం ఎందుకు కలుషితం చేసావో చెప్పు. యుద్ధంలో పాల్గొనకుండా, యుద్ధంతో ఏ మాత్రం సంబంధం లేని సామాన్య పౌరులపై ఆంబోతుల్లా పడి వాడకొక వనితగా వారిని చెరిచే హక్కు నీకెవరు ధారాదత్తం చేసారో చెప్పు" అని ఆవేశంగా అడిగేడు.

ఖాన్ ధైర్యం కాస్త చెదిరింది. "చూడు మిస్టర్! ఆ యుద్ధం నేను ప్రేరేపించినది కాదు. నా లాభం గురించి జరిగినదీ కాదు. అందులో నేనొక సైనికుడిని మాత్రమే. తక్కిన వాళ్లందరూ ఏం చేసారో నేనూ అదే చేసాను. నాకు సివిలియన్స్ మీద పగా లేదు, ద్వేషమూ లేదు. సైన్యం ఊరిని ఆక్రమించుకున్నప్పుడు కొన్ని కొన్ని ఘోరాలు జరగడం సహజమని చరిత్ర చెపుతోంది. వాటిని మర్చిపోవాలి."

బాబాకు ఏడుపు వచ్చింది. "మర్చిపొమ్మని ఎంత సులభంగా అన్నారండీ? నా తల్లి ఎంత కష్టపడిందో మీకేం తెలుసు? వలచినవాడు వంచించినా స్త్రీ బాధపడుతుంది. పొరుగింటివాడు చెరచడానికి వస్తే ప్రతిఘటిస్తుంది; రచ్చ కీడుస్తుంది. పెళ్లి చేసుకోమని బలవంతపెడుతుంది. కానీ మీ విషయంలో? మీ చేతిలో ఆయుధాలుంటాయి. తుపాకులు చూపి తుచ్ఛమైన కోరికలు తీర్చుకుంటారు. కసి తీర్చుకుందామన్నా కళ్లబడరు మళ్లీ. ఇవాళ ఇక్కడ; రేపు మరోచోట! ఎక్కడకెళతారో వెళ్లేదాకా మీకే తెలియదు...

"తల్లి అయిన స్త్రీ తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డను చూసి ఎంతో ఆనందిస్తుంది. కానీ మా అమ్మ విషయంలో ఏం జరిగింది? పుట్టిన బిడ్డలో తనను చెరిచిన శత్రు సైనికుడి పోలిక చూసి ఆనందించాలా? తనపై జరిగిన అత్యాచారానికి చెరగిపోని గుర్తుగా మిగిలిన బిడ్డడ్ని చూసి సంతసించాలా? తన జాతి మనుష్యుల మధ్య వేరే జాతి పోలికలతో పిల్లవాణ్ని కని, వాణ్ని తనవాళ్లు వెలివేస్తూంటే చూసి ఉప్పొంగిపోవాలా? ఆమె పట్ల ఎందుకిలా జరగాలి? ఎవరిదీ తప్పు?" అన్నాడు ఆవేశంగా.

ఖాన్ కరిగేడు. నచ్చచెప్పబోయాడు. "నీ బాధ నా కర్తమవుతోంది. కానీ మా తప్పు మాత్రం ఏముంది చెప్పు? పొట్టకూటి కోసమైతేనేం, దేశభక్తితోనైతేనేం సైన్యంలో చేరతాం. మా కుటుంబాలకు దూరంగా ఎక్కడో పడేసి ఉంచుతారు. యుద్ధ సమయంలో ఏళ్ల తరబడి భార్యాబిడ్డల్ని చూడడానికి వీలుండదు. ఆ యుద్ధాలు మాత్రం మేం కోరుకున్నవా? ఎవరో ఇద్దరు ప్రభుత్వాధినేతలు తమ తమ రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రజల దృష్టిని మళ్లించడానికి యుద్ధాలు చేస్తున్నారు. ఆ సమరాగ్నిలో నువ్వూ, నేనూ, మనలాటివాళ్లందరమూ సమిధలమే..."

"...ఆ అధినేతలు మిమ్మల్ని బలాత్కారాలు చేయమని బలవంతపెట్టారా?"

ఖాన్‌కి కోపం ముంచుకొచ్చింది. "బలవంత పెట్టలేదు. కానీ ఆ పరిస్థితులు సృష్టించారు. మా భార్యలను మా నుండి విడదీసి నెలల తరబడి యుద్ధాలు చేయమంటే ఎలా? మా చేత చిక్కిన సివిలియన్స్‌నే అనుభవిస్తాం. వాళ్ల పాపం ఏమిటని మళ్లీ అడగకు. ఇదంతా భగవంతుని లీల అనుకో. అందుకే ఇదివరకే నేను చెప్పాను. మళ్లీ చెప్తున్నాను, గో టు హెల్!!"

బాబా తలెత్తి చివ్వున చూసాడు. అతని పద్ధతిలో మార్పు వచ్చింది - "ఓకే ఖాన్ సాబ్.

నేననుకున్నట్టుగానే మీలో మార్పు రాలేదన్నమాట. 'గో టు హెల్' అన్నారు కదా, అందుకే ఇక్కడికి వచ్చాను. ఇక్కడే నరకాన్ని సృష్టించి నీకు చూపించి పోదామని. నా తల్లినీ, నన్నూ సర్వనాశనం చేసినా నీకు కించిత్తు బాధ కూడా కలుగలేదు. కానీ నీ కూతురు షబ్నమ్ మొగుడి కోసం, తన బిడ్డ తండ్రి కోసం పడే తపన చూసైనా బాధపడతావుగా?"

ఖాన్ మొహం వివర్ణమైంది. వచ్చి బాబా రెండు భుజాలు పట్టుకున్నాడు. "షబ్నమ్ నీకెలా తెలుసు? దాని పురుటి సంగతి నీకెలా తెలుసు?... మిస్టర్ రావ్, ఇందులో ఏదో దగా ఉంది. మీకూ దీంట్లో సంబంధం ఉన్నట్టుంది. ఐ విల్ షూట్ దిస్ ఫెలో. మిమ్మల్ని కూడా వదలను." అంటూ రొప్పసాగేడు.

నాకు భయం వేసింది. కలగజేసుకోకపోతే లాభం లేదనిపించింది. "బాబా, ఏం జరిగిందో చెప్పేయి. ఖాన్ గారి సంగతి తెలుసుకదా" అన్నాను.

బాబా అప్పుడు చెప్పాడు – షబ్నమ్ బిడ్డకు అతనే తండ్రట. నేను పరిచయం చేసాక ఆమె ప్రేమనూ, విశ్వాసాన్నీ చూరగొని ఆమెను తల్లిని చేసాడట. అమెరికా వెళ్లి వస్తానని, అప్పటిదాకా ఎవరికీ తన గురించి చెప్పవద్దనీ చెప్పి ఆమెకు అందకుండా పోయేడుట. అప్పుడప్పుడు ఫోన్ చేసి 'ఈ నెలలో వస్తున్నా, పై నెలలో వస్తున్నా' అని చెప్పి ఊరిస్తున్నాడట.

ఖాన్ నోరు వెళ్లబెట్టుకుని వింటూండగానే నేను ఉండబట్టలేక "అదేమిటయ్యా, బొత్తిగా... చెల్లెలి వరస కదా" అన్నాను.

"మా ముస్లింలలో తప్పులేదు కదండీ, ఏకగర్భ జనితులు కాకపోతే ఫరవాలేదు' అని సమాధానం చెబుతూనే, "నేనిక్కడికి వచ్చే ముందే వకీలు గారి దగ్గిర అంతా రాసిపెట్టి వచ్చాను. ఈయన నన్నిక్కడ చంపితే, సాయంత్రానికి పోలీసులు రావడం ఖాయం. ఏ పాకిస్తాన్ హైకమీషనరు మాత్రం ఏం చేయగలడో చూద్దాం" అన్నాడు.

ఖాన్‌గారు సోఫాలో కూలబడ్డాడు. యుద్ధంలో పనిచేసిన మనిషి. శతృవ్యూహం కనిపెట్టలేనివాడా? యుద్ధంలో ఎప్పుడు ముందడుగు వేయాలో, ఎప్పుడు వెనకడుగు వేయాలో తెలియనివాడా?

"నా కూతురు భవిష్యత్తు కోసం నిన్ను కొడుకుగా, అల్లుడిగా స్వీకరించక తప్పదంటావ్?" అన్నాడు అప్పటికి.

"కొడుకుగా ఆ నాడే స్వీకరించి ఉంటే షబ్నమ్‌ను మోసగించవలసిన ఖర్మ నాకు పట్టేది కాదు. ఆ పాపం నా వల్ల జరిగినా దానికి బాధ్యులు మీరే!" అన్నాడు బాబా.

ఖాన్ నిశ్శబ్దంగా కాసేపు రోదించాడు. కళ్లు తుడుచుకుని లేచాడు. "సరే, గత్యంతరం ఏముంది? అలాగే చేద్దాం. అయినా నువ్వు కడుపున పడగానే మీ అమ్మ గర్భం పోగొట్టుకుని ఉంటే బాగుండేది మరి నిన్ను కనడం ఎందుకు? ఇలా గొడవలు తెచ్చి పెట్టడం ఎందుకు?" అన్నాడు దీనంగా.

"ఆవిడ పల్లెటూరి మనిషి. వదిలెయ్యండి. మీ అమ్మాయి మోడ్రన్ లేడీ. అయినా అబార్షన్ చేయించుకోలేదేం? పెళ్లి కాకుండా తల్లి కావడానికి సిద్ధపడిందేం? ఆడవాళ్ల సంగతే అంత. మీకూ, మాకూ అర్థం కావులే సాబ్..." అన్నాడు బాబా.

"...అలాగే మీ మగవాళ్ల పద్ధతులూ నా కర్థం కావు" అంటూ గదిలోకి విసురుగా ప్రవేశించింది షహనాజ్.

ఖాన్ చప్పున ఆమె దగ్గరికి వెళ్లి, ఆమె పొదివి పట్టుకుని, "విన్నావా షహనాజ్..." అంటూ ఏదో చెప్పబోతూండగా ఆమె వారించింది. "నేను ఇంట్లోనే ఉన్నానన్న విషయం మర్చిపోయినట్టున్నారు. అవతల షబ్నమ్ పురిటి నొప్పులు పడుతోంది. హాస్పిటల్ దరిదాపుల్లో ఉండకూడదంటూ ఇంట్లో ఉంచేసి పెట్టారు. ఇక్కడ కూచుంటే మీ పాతపురాణాలు బయటపడుతున్నాయి" అంటూ బాబా కేసి చూసి "నువ్వింతటి ఘనుడనుకోలేదయ్యా!" అంది వెటకారంగా.

బాబా ఏమీ అనలేక ఒక నమస్కారం పెట్టి ఊరుకున్నాడు. షహనాజ్ భర్త కేసి, బాబా కేసి మార్చి

మార్చి చూసింది. "అవును, నాకు తెలియక అడుగుతాను. మీకు పగలు తీర్చుకోడానికి ఆడవాళ్లే దొరుకుతారా? ఒక జాతి మీద, ఒక కుటుంబం మీద పగ తీర్చుకోవడం అంటే వాళ్ల ఆడవాళ్ల శీలం హరించడమని అర్ధమా? పంజాజ్ టెర్రరిస్టులను అణచాలన్నా, శ్రీలంక టైగర్లను అదుపు చేయాలన్నా సైన్యం ఆడవాళ్లను అనుభవించక తప్పదా? ఆ టెర్రరిస్టుల నణచగలిగే సైన్యాధికారి కంటబడిన ఆడవాళ్లను చరిచినా, చెరిచినా తప్పులేదా? యుద్ధ సమయంలో సరేసరి... ఇప్పుడు కూడా యీ బాబాకు పగ తీర్చుకోడానికి ఒక అమాయకపు కన్నెపిల్ల సమిధగా మారింది. మీ ఎత్తుల పై యెత్తుల్లో, నక్కజిత్తుల్లో నా కూతురు బతుకు నాశనమయింది. వీటిలో గెలుపు ఈ మగాడిదో, ఆ మగాడిదో కావచ్చు కానీ ఓటమి మాత్రం ఆడదానిదే. సమరంలో కానీ, శాంతి సమయంలో కానీ – సమిధలు ఎప్పుడు స్త్రీలే. వాళ్ల మనస్సూ, శరీరమూ దహనం కాక తప్పదు.

"ఏం మిస్టర్ రావ్... ఈ మొగాళ్ల మధ్య రాజీ కుదిరితే మాత్రం నేను దానికి ఆమోదముద్ర వెయ్యాలా? మా ఆడవాళ్లను సంప్రదించే అవసరం లేదా? ఈ చదరంగంలో మేం పావులం మాత్రమేనా? సయోధ్య కుదిరి నా కూతురుకి పెళ్లి కావచ్చు కానీ తనను సాధనంగా ఉపయోగించిన వాడిపై ఆమె మనస్సు పడగలదా? సవతి కొడుకుగా కానీ, అల్లుడిగా కానీ ఇతన్ని నేనెందుకు ఒప్పుకోవాలి? చెప్పండి, మీరే చెప్పండి" అంటూ ఆమె పెద్దపెట్టున ఏడుస్తూ నన్ను పట్టుకుని కుదిపివేసింది.

ఆమె వేసిన ప్రశ్నలు కూడా నన్ను కుదిపివేసాయి. చివరికి బాబా గెలిచాడో, లేదో మన కనవసరమనిపించింది. ఆ మాతృమూర్తి, ఆ మహిళ వేసిన ప్రశ్నలకు ఎవరైనా సమాధానం చెప్పగలిగితే బాగుణ్ణనిపించింది.

●

(కథామహల్ 1999లో ప్రచురితం)